క్లుప్తంగా

వధూవరులకు ఎమ్మెల్సీ ఆశీర్వాదం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 11వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపాల్ యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్ వివాహానికి పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు.

ఖరీఫ్ సాగుపై సమీక్ష



హాజరైన వ్యవసాయాధికారులు

నెల్లూరు(అర్బన్) : వ్యవసాయాధికారులు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నీటి లభ్యతను బట్టి పంటలను ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు సూచించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం విజయవాడ నుంచి అన్ని జిల్లాల వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్లో వీడియో కాన్ఫరెన్స్‌కు జేడీ సత్యవాణి, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఏడీ సుబ్బారెడ్డి, మత్స్యశాఖ జేడీ శాంతి, పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్‌నాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేడీ సత్యవాణి జిల్లాలో నీటి వనరులు, సాగు చేస్తున్న పంటలు గురించి వివరించారు.

హనుమజ్జయంతి ఉత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హనుమజ్జయంతి మహోత్సవం జరుగనుందని ఈఓ కె.కామేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు లక్ష ఆకుపూజ, 10 గంటలకు స్నపన తిరుమంజనం, రాత్రి 7 గంటలకు నగరోత్సవం ఉంటుందన్నారు.

హాజరును పర్యవేక్షించాలి

నెల్లూరు(బారకాసు): నగరంలోని అన్ని డివిజన్లలో పారిశుద్ధ్య కార్మికుల హాజరుకు సంబంధించిన మస్టర్‌ను తప్పనిసరిగా పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగర పాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని ఎస్ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల హాజరును పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేసి పరిశీలించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వెటర్నరీ వైద్యులు మదన్‌మోహన్, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, సూపరింటెండెంట్ సులోచన, శానిటేషన్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాద చర్యలను ఖండించాలి

కొడవలూరు: ఉగ్రవాద చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని రిటైర్డ్ హెచ్ఎం కె.వెంకయ్య అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో 'యాంటీ టెర్రరిజం'పై బుధవారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం ప్రమాదకరమైందన్నారు. మన చుట్టూ ప్రమాదకరమైన వ్యక్తులు ఉంటే పోలీసులకు అప్పగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తొలుత పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారితో పాటు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ విచారణ

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీఓ రమణయ్య బుధవారం విచారణ చేపట్టారు. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగాయని అధికారులకు విన్నవించి ఉన్నారు. ఈ నేపథ్యంలో డీఎల్‌పీఓ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. కాగా సర్పంచ్ వెంకయ్య మాట్లాడుతూ పంచాయతీలో ఎటువంటి అవకతవకలకు చోటులేదన్నారు. మైపాడు పంచాయతీకి మంచి పేరు ఉందన్నారు. నిధుల దుర్వినియోగం జరిగిందని నిరూపిస్తే ఏ చర్యలైనా తమపై తీసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ పెంచలశ్యామ్, పంచాయతీ కార్యదర్శులు సురేష్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు

పొదలకూరు నుంచి అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

రాపూరు : రాపూరు ఆర్టీసీ డిపో నుంచి జూన్ 10వ తేదీన అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ బస్సు ఉదయం 9 గంటలకు పొదలకూరు నుంచి బయలుదేరి రాపూరు, డక్కిలి, వెంకటగిరి, సిరిపురం గోల్డ్ టెంపుల్ గుండా అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. రాను పోను టిక్కెట్ ధర రూ.1,300 అని, ముందుగా రిజర్వేషన్ చేసుకోవచ్చని వివరించారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





అండర్ బ్రిడ్జి వద్ద వర్షపునీటిలో కలుస్తున్న డ్రైనేజీ నీరు

జోరువాన.. పొంగిన కాలువలు

- ప్రధాన రోడ్లు జలమయం
- అండర్ బ్రిడ్జిల్లోకి చేరిన వర్షపునీరు
- రాకపోకలకు ఇబ్బందులు

నెల్లూరు(బారకాసు) : ఉపరితల ఆవర్తన ప్రభావంతో బుధవారం నగరంలో జోరు వర్షం కురిసింది. దాదాపు రెండు గంటల పాటు ఎడతెరపి లేకుండా వాన పడింది. దీంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. నీటి ప్రవాహానికి వాహదారులు, పాదచారులు అనేక పాట్లు పడాల్సి వచ్చింది. నగరంలోని పలు ప్రాంతాల్లోని వీధులు, కాలనీల్లో వర్షపు నీరు నిల్వ చేరింది. అంతేకాకుండా ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి, విజయమహల్ గేట్ అండర్ బ్రిడ్జి, రామలింగాపురం, మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జిలలో నీరు నిల్వ చేరడంతో వాహనాలు కష్టతరంగా ముందుకెళ్లాయి. ఎస్ఎంసీ సిబ్బంది ప్రత్యేక మోటార్ల ద్వారా నీటిని తొలగించే చర్యలు చేపడుతున్నారు.

వాహనదారులకు ఇక్కట్లు

వర్ష ప్రభావంతో నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని గుంతల్లో నీరు చేరింది. అవి కనిపించకపోవడంతో రాకపోకల సమయాల్లో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ద్విచక్ర వాహదారులు ఆయా గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

పొంగి పొర్లుతున్న మురుగునీరు

నగరంలోని ట్రంకురోడ్డు సండే మార్కెట్ ప్రాంతంలో మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. అదేవిధంగా పొగతోట, మూడు హళ్ల వీధి, ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, పెద్దబజార్, చిన్నబజార్, ఆచారివీధి, లీలామహల్ రోడ్డు, మద్రాసుబస్టాండ్, ఆర్టీసీ, ఫత్తేఖాన్‌పేట, ఎన్‌జీఓ కాలనీ, దర్గామిట్ట, రామలింగాపురం, రామ్మూర్తినగర్, బాలాజీనగర్, నవాబుపేట, జనార్దన్‌రెడ్డికాలనీ, భగత్‌సింగ్ కాలనీ, మెక్లిన్స్‌రోడ్డు తదితర ప్రాంతాల్లోని రోడ్లలో వర్షపు నీరు నిల్వతో పాటు కాలువల నిండి వాటి నుంచి మురుగు నీరు రోడ్డుపైకి పొంగి ప్రవహిస్తుండటంతో ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది.

సహాయక చర్యల్లో ఎస్ఎంసీ సిబ్బంది

నగరంలోని పలు ప్రాంతాలతో పాటు లోతట్టు, శివారు ప్రాంతాల్లో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేలా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రణాళికాబద్ధంగా సహాయక చర్యలు చేపడుతున్నారు. జేసీబీల సాయంతో శివారు ప్రాంతాల్లోని మురుగు కాలువలు, పెద్ద కాలువలు, పంట కాలువల్లో ఉన్న వ్యర్థాలు, అడ్డంకులను తొలగించి నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చేస్తున్నారు.



గాంధీబొమ్మ సెంటర్ వద్ద నిలిచిన వర్షపునీరు



నీటిలో ఆగిపోయిన వాహనాలను నెట్టుకొస్తూ..

మెడికవర్‌లో అరుదైన న్యూరో శస్త్రచికిత్స

నెల్లూరు(అర్బన్) : తమ ఆస్పత్రిలో ఓ మహిళకు మెదడుకు సంబంధించి అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ గంగపట్నం దినేష్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను కోలుకున్న మహిళతో కలిసి బుధవారం ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరించారు. గూడూరు సమీపంలోని చెంబర్తి గ్రామానికి చెందిన 50 ఏళ్ల లక్ష్మి రెండు నెలల క్రితం ఇంటి వద్దనే కింద పడిపోయిందన్నారు. భర్త పెంచలయ్య ఆమెను నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ ఆమె కోమాలోకి పోవడంతో నగరంలోని మరో ఆస్పత్రికి, అక్కడి నుంచి చెన్నైకు తరలించారన్నారు. అయితే నెలలు గడుస్తున్నా కోలుకోకపోవడంతో చివరిగా మెడికవర్ ఆస్పత్రికి తీసుకుని వచ్చారన్నారు. తమ పరీక్షల్లో ఆమెకు మెదడులో కణితి ఉన్నట్టు గుర్తించామన్నారు. దీంతో ఐదు గంటల పాటు శ్రమించి మెదడులో



కోలుకున్న లక్ష్మితో కలిసి మాట్లాడుతున్న న్యూరో సర్జన్

బ్రెయిన్ స్టెమ్ అనే లోతైన ప్రదేశంలో ఉన్న కణితిని విజయవంతంగా తొలగించామన్నారు. ఆమె కోమా నుంచి బయటకు రావడమే కాకుండా పూర్తిగా కోలుకుందన్నారు. ఆమెకు ఎలాంటి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేశామన్నారు. సెంటర్ హెడ్ ధీరజ్, పీఆర్వో చందువర్మ పాల్గొన్నారు.

పాత ధ్వజస్తంభం తొలగింపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వివిధ అభివృద్ధి పనుల్లో భాగంగా అనివెట్టి మండపంలో ఉన్న పాత ధ్వజస్తంభాన్ని బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా పలు రాగియంత్రాలు, నాణేలు, చిన్నముత్యం, లోహపు ముక్కలు లభించాయని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రెవెన్యూ, పోలీస్, జిల్లా దేవదాయశాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్, పూడిపర్తి గ్రూప్‌ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎన్.శ్రీధర్‌నాయుడు, ప్రధానార్చకుడు ఎస్.రఘురామమూర్తి, వేదపండితులు, భక్తుల సమక్షంలో నిర్వహించినట్లు ఆయన వివరించారు.



మధ్యాహ్నమైనా సిబ్బంది రారే?



మధ్యాహ్నం 12 గంటలైనా తెరుచుకోని సంఘమిత్ర కార్యాలయం

- విధుల్లో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంఘమిత్ర సిబ్బంది
- అసహనం వ్యక్తం చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

విడవలూరు: స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10 గంటకు విధులకు హాజరు కావాల్సిన సిబ్బంది నిత్యం మధ్యాహ్నం 12 గంటలైనా రావడం లేదు. ఒకేసారి భోజనం తరువాత తీరిగ్గా వస్తున్నట్లు పొదుపు సంఘాల మహిళలు, గ్రామస్తులు వాపోతున్నారు. మండల కార్యాలయంలో ఏపీఎం, సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్, అధ్యక్షురాలు, అటెండర్‌తో సహా తొమ్మిది మంది సిబ్బంది హాజరు కావాల్సి ఉండగా, ఒక్కరూ విధులకు హాజరు కాకపోవడంతో మధ్యాహ్నం వరకు కార్యాలయం మూతపడి ఉంటోంది. దీంతో పొదుపు సంఘాల మహిళలు మధ్యాహ్నం వరకు కార్యాలయ ఆవరణలో వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు కార్యాలయానికి సెలవేమో అని వెనుదిరుగుతున్నారు. దీనిపై స్థానిక ఏపీఎం వెంకమ్మను వివరణ కోరగా తాను నెల్లూరులో నిర్వహిస్తున్న ఓ ట్రైనింగ్ క్లాసులో ఉన్నానని, కార్యాలయంలో సిబ్బంది సమయపాలన పాటించని విషయం తనకు తెలియదని, ఇక నుంచి అందరూ విధులకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలియజేశారు.

పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ పేదలకు శాపం

నెల్లూరు (టౌన్): కూటమి ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ పేద విద్యార్థులకు శాపంగా మారుతుందని ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ విధానాన్ని ఏఐడీఎస్‌ఓ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ఓ వైపు 117 జీఓను రద్దు చేస్తామని చెప్పి మరోవైపు జీఓ నంబర్ 19, 21లను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పిందన్నారు. ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాలు లేని కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. విద్యావేత్తలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో చర్చించిన తరువాతే విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలన్నారు.

శాస్త్రోక్తంగా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గ పరిధిలోని పెద్ద చెరుకూరు అరుంధతీయవాడలో మాతా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాన్ని జరిపించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మనుబోలు శేషారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేమిరెడ్డి మైనింగ్ వ్యాపారానికి నేనే కారణం

- రూప్‌కుమార్ యాదవ్

నెల్లూరుసిటీ : మైనింగ్ వ్యాపారంలోకి వేమిరెడ్డి రావడానికి కారణం తానే అని నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ అన్నారు. నగరంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి అనిల్‌పై రూప్‌కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వేమిరెడ్డిపై మాట్లాడే స్థాయి ఎవరికీ లేదన్నారు. హెచ్‌పీక్యూ హైప్యూరిటీ క్వార్ట్జ్ శ్యాండ్ ప్రాసెస్ చేసే దేశాలు చైనా, జపాన్, అమెరికా మాత్రమే ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లో భారతదేశానికి ఆదాయం తీసుకొచ్చేందుకు వీపీఆర్ వందల కోట్లు ఖర్చు చేసి ఇక్కడ వ్యాపారం చేయడానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

డీఆర్వోకు వినతి

నెల్లూరురూరల్ : హౌసింగ్ అధికారుల అవినీతిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. హౌసింగ్ అధికారుల నిర్వాహకంతో బీసీ, ఎస్సీ, ఎస్టీలు నష్టపోయారని, జిల్లాలో దాదాపు ఆరు వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు నష్టం జరిగిందన్నారు. ..

పార్కుల్లో మౌలిక వసతుల కల్పన

- కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : నగరంలోని అన్ని పార్కుల్లో మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా ఆయన స్థానిక నీలగిరి సంఘం, గణేష్ ఘాట్ పరిసర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. డివిజన్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. మేజర్, మైనర్ కాలువల్లో క్రమం తప్పకుండా పూడికతీత పనులు, సిల్ట్ ఎత్తివేత చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. స్థానిక 23వ డివిజన్ పడారుపల్లి ప్రాంతంలో రోడ్ల నిర్మాణ పనులను, డ్రెయిన్ కాలువల పూడికతీతను పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉన్న భవనాలకు కొలతలు వేయించి అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. అనుమతులకు మించి భవన నిర్మాణాలు జరగడం, నిర్మాణానికి తగ్గట్టుగా డిమాండ్ లేకపోవడం వంటి వివిధ అంశాలపై ఇద్దరు వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులరైజేషన్ కార్యదర్శులు, ఒక వార్డు అడ్మిన్ కార్యదర్శికి, సంబంధిత ఆర్ఐలకు షోకాజ్ నోటీసులు జారీ చేయమని ఆదేశించారు. స్థానిక మిలిటరీ కాలనీలో పసల పెంచలయ్య మున్సిపల్ పార్కు, కొండాయపాళెం ప్రాంతంలోని సోంపల్లి మౌనిష్ పార్కులను



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

ఆయన సందర్శించారు. పార్కుల్లో పచ్చదనం, వాకింగ్ ట్రాక్, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు, చిన్నారులకు క్రీడా వస్తువులు, వ్యాయామ పరికరాలు, విద్యుద్దీపాలు తదితర వసతులను కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పరిరక్షించాలని సూచించారు. స్థానిక చిల్డ్రన్స్ పార్కులో జరుగుతున్న యోగ కార్యక్రమాల్లో కమిషనర్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, రెవెన్యూ, శానిటేషన్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి అడ్డా నెల్లూరు రూరల్



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్‌ను తిరిగి వైఎస్సార్‌సీపీ అడ్డాగా మారుస్తానని పార్టీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో 32వ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 32వ డివిజన్ ఇన్‌చార్జిగా సయ్యద్ ముజాఫర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. తాను కూడా మీలో ఒక్కడినే అని, పార్టీకి ఒక కార్యకర్తగానే పనిచేస్తానన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కుటుంబసభ్యులుగా అంకితభావంతో కలిసి మెలిసి పని చేయాలన్నారు. 2029లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకునేలా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, రూరల్ మండలాధ్యక్షుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, వివిధ విభాగాల అధ్యక్షులు కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, అబ్దుల్ రజాక్, సుకుమార్‌రెడ్డి, 18వ డివిజన్ ఇన్‌చార్జి భానుప్రకాశ్‌రెడ్డి, 32వ డివిజన్ నాయకులు గౌస్‌బాషా, యాసిన్, జావిద్, మస్తాన్, షఫీ, సమీ, అఖి, శివ, అల్తాఫ్, రబ్బానీ, హమీద్, సర్దార్, మహిళా నేతలు శశికళ, పర్వీన్, బాను, మొబినా, రమీజా తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల్లో జాగ్రత్తలు వహించండి

నెల్లూరు(బారకాసు) : స్థానిక పొదలకూరు రోడ్డు వెంబడి నూతనంగా చేపడుతున్న భూగర్భ గ్యాస్ పైపులైన్ పనుల్లో అత్యంత జాగ్రత్తలు వహించాలని ఏజీపీ సిటీ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులకు కమిషనర్ నందన్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కంపెనీ ప్రతినిధులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పైపులైన్ ఏర్పాటు పనులను రోజువారీగా ఇంజినీరింగ్ విభాగానికి ముందస్తుగా తెలియజేయాలన్నారు. నిర్దేశించిన మేరకు మాత్రమే పైపులైన్ పనులు చేపట్టాలని, భూగర్భ డ్రెయిన్, తాగునీటి పైపులైన్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ కల్యాణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్

క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అక్కులూరి శ్రీనివాసులురెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి 600 మంది క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి హాజరై, దాతలను అభినందించారు. శ్రీనివాస్‌రెడ్డి మనవళ్లు ఆయనష్, అరుష్‌తో పాటు వివేకానంద అసోసియేషన్ ప్రెసిడెంట్ అమరేంధర్‌రెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపినాథ్, వివేకానంద అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



యోగాతో ఆరోగ్యం, మానసికోల్లాసం



యోగా చేస్తున్న వాకర్స్

- కమిషనర్ నందన్

నెల్లూరు(బృందావనం): ఆరోగ్య పరిరక్షణతో పాటు మానసికోల్లాసానికి యోగా ఎంతో తోడ్పడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ తెలిపారు. శ్రీరామచంద్ర మిషన్-హార్ట్ ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో చిల్డ్రన్స్‌పార్క్‌లో బుధవారం నిర్వహించిన 'యోగోత్సవ్' ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యయోగా సాధనతో దేహదారుఢ్యం కలుగుతుందన్నారు. శ్రీరామచంద్ర మిషన్ జోనల్ కో-ఆర్డినేటర్ ఎంఆర్ గంగాధర్ మాట్లాడుతూ యోగాపై ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. వచ్చే జూన్ ఒకటో తేదీన ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పొదలకూరు రోడ్డు గౌతమినగర్‌లో భారీస్థాయిలో యోగా, ధ్యాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కమిషనర్‌ను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో యోగా మిత్రమండలి అధ్యక్షుడు ఎం.రవీంద్ర, చిల్డ్రన్స్‌పార్క్ కమిటీ సభ్యులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు



కమిషనర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు